సంగారెడ్డి
నమస్తే తెలంగాణ | మంగళవారం 23 ఏప్రిల్ 2024
TUESDAY, APRIL 23, 2024

కంగ్టి క్రాంతిచౌక్‌లో మాట్లాడుతున్న జహీరాబాద్ లోక్‌సభ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్

ప్రజలకిచ్చిన హామీలు ఏమయ్యాయి

- ఆరు గ్యారెంటీల అమలు మరిచారా?
- ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చారు
- బీఆర్ఎస్ జహీరాబాద్ లోక్‌సభ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్

కంగ్టి, ఏప్రిల్ 22: ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నేతలు ప్రజలకిచ్చిన హామీలు మరిచారా అంటూ బీఆర్ఎస్ జహీరాబాద్ లోక్‌సభ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ ప్రశ్నించారు. ఆదివారం రాత్రి కంగ్టిలో నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డితో కలిసి స్థానిక క్రాంతిచౌక్‌లో రోడ్డుషో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి నాలుగు నెలలవుతున్నా ఇచ్చిన 420 హామీల్లో రెండు మాత్రమే అమలు చేశారన్నారు. మహిళలకు ఉచితంగా బస్సు అని చెప్పి సర్వీసులు తగ్గించారని ఆరోపించారు. చాలామందికి గృహ జ్యోతి ఇంకా అమలుకాలేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.15 వేలు, రుణమాఫీ చేస్తామని గొప్పలు చెప్పి ఇప్పుడు మోసం చేశాడని ఆరోపించారు. మే 13న కారుగుర్తుకు ఓటేయాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ నారాయణఖేడ్ నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేశామన్నారు. బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందరికీ అందాయన్నారు. కార్యక్రమంలో తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షుడు మఠం భిక్షపతి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గంగారాం, రైతుబంధు సమితి మండలాధ్యక్షుడు ఆంజనేయులు, నాయకులు వెంకట్‌రెడ్డి, కృష్ణముదిరాజ్, అంజాగౌడ్ తదితరులు ఉన్నారు.

'అధికార అహంతో విర్రవీగుతున్నారు'

సిర్గాపూర్, ఏప్రిల్ 22: అధికార అహంతో కాంగ్రెస్ నాయకులు విర్రవీగుతున్నారని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఆదివారం రాత్రి సిర్గాపూర్‌లో జహీరాబాద్ ఎంపీ అభ్యర్థితో కలిసి రోడ్ షో నిర్వహించారు. అధికార పార్టీ తమ చేతిలో ఉందని కాంగ్రెస్ నాయకులు దౌర్జన్యానికి పాల్పడి, బీఆర్ఎస్ నాయకులపై దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. పార్టీ కోసం, కార్యకర్తల కోసం తన ప్రాణాలు ఇవ్వడానికైనా సిద్ధంగా ఉన్నానని తెలిపారు. కార్యకర్తలు ఎలాంటి భయభ్రాంతులకు గురికావద్దని సూచించారు. అధికారులు అధికార పార్టీకి వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కూతురు శ్రేయారెడ్డి, జడ్పీటీసీ రాఘవరెడ్డి, పార్టీ అధ్యక్షుడు సంజీవరావు, వైస్ ఎంపీపీ ప్రయాగమాధవరావు, కోఆప్షన్ సభ్యుడు బషీర్, ఎంపీటీసీ శాంతాబాయి, మాజీ సర్పంచ్ భారతీబాయి, నాయకులు యాదవరావు, నర్సాగౌడ్ తదితరులు ఉన్నారు.

వీరభద్రుడి ఆలయ హుండీ లెక్కింపు

రాయికోడ్, ఏప్రిల్ 22: వీరభద్రేశ్వర స్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.3.47 లక్షలకు పైగా వచ్చిందని ఆలయ ఈవో మోహన్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండల కేంద్రమైన రాయికోడ్‌లోని వీరభద్రేశ్వర స్వామి, భద్రకాళి అమ్మవార్ల హుండీ ఆదాయాన్ని లెక్కించారు. ఈ సందర్భంగా ఈవో మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. గత ఆరు నెలల హుండీ ఆదాయాన్ని లెక్కించగా రూ.3.47 లక్షలు వచ్చిందని తెలిపారు. ఈ నెల 27వ తేదీ నుంచి మే 2వ తేదీ వరకు జాతర ఉంటుందని, భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఆలయ ఆవరణంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని సూచించారు. భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పించాలని, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. కార్యక్రమం లో సిబ్బంది కృష్ణ ఉన్నారు.

వీరభద్రేశ్వర స్వామి ఆలయంలో హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

సోలక్‌పల్లిలో ముగిసిన క్రికెట్ టోర్నీ

విజేత జట్టుకు బహుమతి ప్రదానం చేస్తున్న బీజేపీ నాయకులు

జిన్నారం, ఏప్రిల్ 22: సోలక్‌పల్లిలో ఛత్రపతి శివాజీ మహరాజ్ యువజన సంఘం ఆధ్వర్యంలో పదిహేను రోజులుగా నిర్వహించిన క్రికెట్ టోర్నీ సోమవారం ముగిసింది. టోర్నీ విజేతగా రాళ్లకత్వ జట్టు, రన్నరప్‌గా ఊట్ల జట్టు నిలిచింది. సోమవారం బహుమతులు ప్రదానం చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు జగన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన బహుమతుల ప్రధానోత్సవానికి పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి హాజరయ్యారు. విజేత జట్లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి వై.వెంకటేశ్, నాయకులు సీహెచ్ వెంకటేశ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

చీక్‌మద్దూర్‌లో రక్తదాన శిబిరం

హత్నూర, ఏప్రిల్ 22: మండలంలోని చీక్‌మద్దూర్ గ్రామంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. నాలుగురోజులుగా జాతీయసేవా పథకం ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణా శిబిరం కొనసాగుతున్నది. సోమవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 35 మంది ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో పాటు గ్రామ యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు, వైద్యులు వెంక ట్, శాస్త్రవేత్తలు సయ్యద్ అహ్మద్ హుస్సేన్, అనిల్, శ్రీవల్లి, నిర్వాహకులు రమేశ్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

జోగినాథ ఆలయ ఉత్సవాల్లో అపశ్రుతి

రావణ ప్రతిమ కూలి ఐదుగురికి గాయాలు

అందోల్, ఏప్రిల్ 22: జోగిపేట జోగినాథ స్వామి ఆలయ ఉత్సవాల్లో అపశ్రుతి చోటు చేసుకుంది. ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి లంకాదహనం నిర్వహించాల్సి ఉన్నది. దీనికోసం స్థానికంగా ఉన్న ఉన్నత పాఠశాల మైదానంలో 50 అడుగుల భారీ రావణుడి ప్రతిమను ఏర్పాటు చేశారు. సోమవారం సాయంత్రం ప్రతిమకు తుది మెరుగులు దిద్దుతుండగా గాలి దూమారం రావడంతో పైన పనిచేస్తున్న ఐదుగురు కార్మికులు కిందపడగా తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని జోగిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అక్కడి నుంచి సంగారెడ్డికి తరలించారు. గాయపడిన వారు ఆంధ్రప్రదేశ్‌లోని రాజోలుకు చెందిన ప్రవీణ్, రాములు, మహేందర్, జానకీరామ్, వెంకటయ్యగా గుర్తించారు. ప్రమాదంలో కాళ్లు, చేతులు, తలకు గాయాలయ్యాయి. ఘనంగా జరగాల్సిన లంక దహనంలో ఇలాంటి అపశ్రుతి చోటుచేసుకోవడంపై భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నడూ ఇలా జరుగలేదని వాపోయారు.

చకచకా సిద్ధేశ్వరాలయ రథం పనులు

కంగ్టి, ఏప్రిల్ 22: కంగ్టి సిద్ధేశ్వరాలయ ఉత్సవాలకు ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కట్టెలతో రథాన్ని తయారు చేసే పనులు చకచకా సాగుతున్నాయి. బుధవారం శిఖరోత్సవం జరగనుండగా, గురువారం ప్రత్యేక పూజలు ఉంటాయి. శుక్రవారం అగ్నిగుండం, అదేరోజు సాయంత్రం రథోత్సవం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. రథోత్సవం సుమారు 2 కి.మీ మేరా కొనసాగుతుందని, ఈ ఉత్సవాలకు భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు.

కాంగ్రెస్‌కు ఓటుతోనే బుద్ధి చెప్పాలి

- ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు
- గాలి అనిల్‌కుమార్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం

చీకూర్తిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

న్యాల్‌కల్, ఏప్రిల్ 22: బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు లోక్‌సభ ఎన్నికల్లో ఓటుతోనే బుద్ధి చెప్పాలని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గ సమన్వయ కర్త దేవిశ్రీప్రసాద్ అన్నారు. సోమవారం మండలంలోని హుస్సేన్‌నగర్, చీకూర్తి, అమీరాబాద్, ముర్తుజాపూర్, కాకిజనవాడ, చాల్కి, రాఘవపూర్, హుమ్నపూర్ గ్రామాల్లో బీఆర్ఎస్ లోక్‌సభ అభ్యర్థి గాలి అనీల్‌కుమార్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు, చర్చిల్లో ప్రార్థనలు చేశారు. అనంతరం ఆయా గ్రామాల్లోని ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలుచేయడంతో విఫలమైందని ఆరోపించారు. పదేండ్ల బీజేపీ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని ఎద్దేవా చేశారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనీల్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.

అమలు కాని 'ఆరు గ్యారెంటీలు'!

కాంగ్రెస్ నేతలు అమలుకాని గ్యారెటీ పథకాలు ఇచ్చి ఒక్కదాన్ని కూడా సరిగా అమలు చేయలేదని జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గ సమన్వయ కర్త దేవీశ్రీప్రసాద్ అన్నారు. రైతులకు రూ.15 వేల సాయం, పంట ఉత్పత్తుకు రూ.500 బోనస్, మహిళలకు ఇస్తామన్న రూ.2,500, పేదల పెండ్లికి తులం బంగారం వంటి పథకాలు పత్తా లేకుండా పోయాయని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నాలుగు నెలల్లోనే కరువు వచ్చిందని, ఇలాంటి దుర్భర పరిస్థితి వచ్చిందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్, నాయకులు భాస్కర్, సంగ్రాంపాటిల్, ఎంఆర్ ప్రవీణ్‌కుమార్, రాజేందర్‌రెడ్డి, భూమారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, అశోక్, అనిల్‌కుమార్, ఈశ్వరప్ప, మాజీద్, అనీఫ్, చంద్రప్ప, మహ్మద్, కాంతారెడ్డి, నర్సారెడ్డి, సంగారెడ్డి, రమేశ్ తదితరులు, పాల్గొన్నారు.

ఆత్మాభిమానం ఉంటే రాజీనామా చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

అందోల్, ఏప్రిల్ 22: బీఆర్ఎస్‌లో గెలిచి వారి స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీని వీడి వెళ్లినవారు ఏ మాత్రం ఆత్మాభిమానం ఉన్నా పదవులకు రాజీనామా చేయాలని అందోల్–జోగిపేట బీఆర్ఎస్ నాయకులు అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ అధికారంలో ఉన్నన్ని రోజులు పదవులు అనుభవించి అధికారం పోగానే పార్టీని వీడడం సిగ్గుచేటన్నారు. ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకొని కాంగ్రెస్, బీజేపీలకు తగిన బుద్ధి చెబుతామన్నారు. సమావేశంలో ఏఎంసీ మాజీ చైర్మన్లు మల్లికార్జున్, నాగభూషణం, మాజీ ఎంపీపీ రామాగౌడ్, నాయకులు వీరబద్రరావు, వెంకటేశం, సంతోశ్, మహేశ్‌యదవ్, బీర్ల శంకర్, అశోక్, నాగరాజు, సుధాకర్‌గౌడ్, సత్యం, శ్రీనివాస్, గోరే, సాయిలు, శంకర్, మల్లేశం, రమణ, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'తారా'లో ప్రపంచ ధరిత్రి దినోత్సవం

మాట్లాడుతున్న తారా కళాశాల ప్రిన్సిపాల్ రత్నప్రసాద్

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 22: తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, బోటనీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం ప్లానెట్ వర్సెస్ ప్లాస్టిక్ అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్ మాట్లాడుతూ భవిష్యత్‌లో ప్లాస్టిక్‌తో మానవాళికి ముప్పు ఏర్పడుతుందని, భూమిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉన్నదన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు వెంకటేశం, పద్మజ, విజయ, ఏవీ శర్మ పాల్గొన్నారు.

వీరభద్రేశ్వరాలయంలో భక్తుల పూజలు

స్వామివారి పల్లకీ సేవ, గంపల జాతరలో పాల్గొన్న భక్తులు

న్యాల్‌కల్, ఏప్రిల్ 22: మండలంలోని మరియంపూర్ వీరభద్రేశ్వర స్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి వారికి వేదపండితులు పాదపూజ, రుద్రాభిషేకం, అభిషేకం, హారతి తదితర పూజలు నిర్వహించారు. స్వామివారి పల్లకీ సేవ, గంప జాతరతో ప్రధాన వీధుల గుండా ఆలయం వరకు ఊరేగింపు చేపట్టారు. మంగళవారం రుద్రాభిషేకం, డాక్టర్ రాజశేఖర్ శివాచార్య స్వామి, 108 సోమలింగ శివాచార్య, ఈశ్వరయ్యస్వామిజీల చేతుల మీదుగా ఆలయ ముఖద్వారం ప్రారంభోత్సవం, రాత్రి 9 గంటలకు పల్లకీ ఊరేగింపును ఉంటుందని ఆలయ కమిటీ అధ్యక్షుడు బస్వరాజ్‌పాటిల్ తెలిపారు. ఆలయ ఉత్సవాలకు పరిసర గ్రామాలతోపాటు కర్ణాటకకు చెందిన భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.

జొన్నల కొనుగోలు కేంద్రం తనిఖీ

బీబీపేటలోని జొన్నల కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ నూతన్‌కుమార్

కల్హేర్, ఏప్రిల్ 22: మండలంలోని బీబీపేటలోని జొన్నల కొనుగోలు కేంద్రాన్ని నారాయణఖేడ్ ఏడీఏ నూతన్‌కుమార్ సోమవారం తనిఖీ చేశారు. రైతుల కోసం ఆన్‌లైన్‌లో టోకెన్ జారీ చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని బీబీపేట, బాచేపల్లి, కల్హేర్ సొసైటీల్లో జొన్నల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులు ఆన్‌లైన్ ద్వారా టోకెన్ పొంది, కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర రూ.3,180 పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో సతీశ్, రైతులు ఉన్నారు.

కల్హేర్‌లో జొన్నల కేంద్రం ప్రారంభం

కల్హేర్, ఏప్రిల్ 22: మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని మండల వ్యవసాయాధికారి శశాంక్ సోమవారం రైతులు, గ్రామ పెద్దలతో కలిసి కాంటాకు పూజలు చేసి ప్రారంభించారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ సీఈవో, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

సురేశ్‌కుమార్ షెట్కార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

న్యాల్‌కల్, ఏప్రిల్ 22: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని జహీరాబాద్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్‌కుమార్ షెట్కార్ అన్నారు. సోమవారం మండలంలోని చినిగేపల్లిలో పార్టీ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పలు పార్టీల నాయకులు సీరాజోద్దీన్, షఫీయోద్దీన్, ఇస్లాం, జుబేర్, నయిమ్, ఏజాజ్‌పాటిల్, నర్సింహారెడ్డి తదితరులు ఎంపీ అభ్యర్థి సురేశ్‌కుమార్ షెట్కార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సిద్ధిలింగయ్యస్వామి, ఎంపీపీ వైస్ చైర్మన్ గౌసొద్దీన్, నాయకులు రఫీయొద్దీన్, గ్రామ నాయకులు హాజీ పటేల్, నయీమ్ పటేల్, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సురేశ్‌షెట్కార్‌ను గెలిపించాలి

వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

జోగిపేటలో మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ

అందోల్, ఏప్రిల్ 22: కాంగ్రెస్ జహీరాబాద్ లోక్‌సభ అభ్యర్థి సురేశ్‌షెట్కార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. సోమవారం జోగిపేటలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ కార్యకర్తలతో పని చేస్తూ ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేయాలన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు, ప్రభుత్వం అమలు చేస్తు న్న ఆరు గ్యారెంటీల గురించి ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ జగన్మోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, వైస్ చైర్మన్ ప్రవీణ్, కౌన్సిలర్లు సురేందర్‌గౌడ్, చిట్టిబాబు, నాగరాజు, డాకూరి శంకర్, దుర్గేశ్, రంగసురేశ్, చెందర్‌నాయక్, ప్రవీణ్, హరికృష్ణగౌడ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ఇంటింటి ప్రచారం

ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ నాయకులు

కోహీర్, ఏప్రిల్ 22: లోక్‌సభ ఎన్నికల్లో జహీరాబాద్ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్‌షెట్కార్‌ను గెలిపించాలని మాజీ మంత్రి చంద్రశేఖర్ నాయకులకు సూచించారు. సోమవారం మొగుడంపల్లి మండలంలోని ఉప్పర్‌పల్లి తండాలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మొగుడంపల్లి మండల ఎన్నికల సమన్వయ కమిటీని నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ విజయం కోసం అందరూ పని చేయాలన్నారు. కార్యక్రమంలో మక్సూద్, శ్రీనివాస్ రెడ్డి, రామలింగారెడ్డి, ఎంజీ రాములు, ఖాజా, చందర్, కండెం నర్సింహులు, సమన్వయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

హెచ్ఎం శశిధర్‌కు ఘనంగా వీడ్కోలు

శశిధర్ దంపతులను సన్మానిస్తున్న ఇన్‌చార్జి ఎంఈవో జెమినీకుమారి

బొల్లారం, ఏప్రిల్ 22: బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని బీసీ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం శశిధర్‌కు సోమవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఉద్యోగ విరమణ సభకు జిన్నారం మండల ఇన్‌చార్జి ఎంఈవో జెమినీకుమారి హాజరై శశిధర్ దంపతులను శాలువాలతో సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఉద్యోగ విరమణ తర్వాత కూడా విద్యారంగంలో తన అమూల్యమైన సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఉమ్మడి జిన్నారం, గుమ్మడిదల మండలాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీలోకి మాజీ ఎంపీటీసీ

ఎంపీ బీబీ పాటిల్ సమక్షంలో బీజేపీలో చేరుతున్న జగన్నాథ్‌రెడ్డి

కోహీర్, ఏప్రిల్ 22: మండలంలోని మనియార్‌పల్లి కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ జగన్నాథ్‌రెడ్డి ఆదివారం రాత్రి ఎంపీ బీబీ పాటిల్ సమక్షంలో బీజేపీలో చేరారు. బిలాల్‌పూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వెంకట్‌రెడ్డితోపాటు అతడి అనుచరులు కూడా బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో తన విజయానికి కృషి చేయాలని ఎంపీ బీబీ పాటిల్ కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వైద్యనాథ్, గోవర్ధన్‌రెడ్డి, సుభాశ్‌రెడ్డి, రాజుస్వామి, నాగరాజు, నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

'సీఎస్ఆర్'తో అంగన్‌వాడీ భవనం ప్రారంభం

ఎంపీడీవో ఉమాదేవిని సన్మానిస్తున్న న్యూలాండ్ ల్యాబ్ పరిశ్రమ ప్రతినిధులు

గుమ్మడిదల, ఏప్రిల్ 22: బొంతపల్లి పారిశ్రామికవాడలోని స్థానిక పరిశ్రమల సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధిలో దూసుకుపోవడం అభినందనీయమని ఎంపీడీవో ఉమాదేవి అన్నారు. బొంతపల్లిలో న్యూలాండ్ ల్యాబ్ పరిశ్రమ సౌజన్యంతో రూ.20 లక్షల సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని సోమవారం ఎంపీడీవో ఉమాదేవి, ఈవో శ్రీనివాస్‌రెడ్డితోపాటు న్యూలాండ్ పరిశ్రమ జీఎం రవికుమార్ హెచ్ఆర్ మేనేజర్ శ్రీహర్ష పూజలు చేసి అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ న్యూలాండ్ ల్యాబ్ పరిశ్రమ సీఎస్ఆర్ నిధులతో నిర్మించి చిన్నారుల భవిష్యత్తుకు శ్రీకారం చుట్టడం హర్షణీయమన్నారు. ఈ పరిశ్రమలు బొంతపల్లి, దోమడుగు తదితర గ్రామాల్లో సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి పనులు చేయడం సంతోషించదగిన విషయమన్నారు. భవనాన్ని నిర్మించిన కాంట్రాక్టర్ పద్మారెడ్డిని పరిశ్రమ ప్రతినిధులు శాలువాతో సన్మానించారు. ఎంపీడీవోను, అధికారులను వారు సన్మానించారు.

బీఆర్ఎస్ రాయికోడ్ మండల అధ్యక్షుడిగా విఠల్

రాయికోడ్, ఏప్రిల్ 22: బీఆర్ఎస్ రాయికోడ్ మండల అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన సి.విఠల్‌ను నియమించారు. సోమవారం వట్‌పల్లి మండలం పోతులబోగుడలో మాజీ ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడిగా విఠల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా విఠల్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో అధ్యక్షుడిగా ఎన్నిక చేసిన మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్, జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీజైపాల్ రెడ్డి, ప్రజా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌కు భారీ మెజార్టీయే లక్ష్యంగా పని చేస్తామన్నారు.

నేడు ఎమ్మెల్యే మాణిక్‌రావు పర్యటన

కోహీర్, ఏప్రిల్ 22: మండలంలోని బడంపేట, గొటిగార్‌పల్లి, పర్సపల్లి, తదితర గ్రామాల్లో ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నర్సింహులు తెలిపారు. బీఆర్ఎస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌కు మద్దతుగా ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం చేస్తారన్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

108 సిబ్బందికి బెస్ట్ సేవర్ అవార్డు

రాష్ట్రస్థాయి బెస్ట్ సేవర్ అవార్డు అందుకుంటున్న 108 సిబ్బంది

సదాశివపేట, ఏప్రిల్ 22: సదాశివపేట 108 సిబ్బంది రాష్ట్రస్థాయి బెస్ట్ సేవర్ అవార్డు అందుకున్నారు. సోమవారం ఈఎంఆర్ఐ డైరెక్టర్, సీఈవో ఖలీద్ స్టేట్ లెవల్ బెస్ట్ సేవర్ అవార్డును ఈఎంటీ హుస్సేన్, పైలెట్ శ్రీనివాస్‌కు అందజేశారు. మండల పరిధిలోని గొల్లగూడెం గ్రామానికి చెందిన రమేశ్ ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించగా ఆయన ప్రాణాలు కాపాడినందుకు 108 సిబ్బందికి బెస్ట్ సేవర్ అవార్డ్ దక్కింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ అవార్డుతో తమపై మరింత బాధ్యత పరిగిందని, భవిష్యత్తులోనూ విధుల్లో బాధ్యతాయుతంగా పని చేసి మండలానికి రాష్ట్ర స్థాయిలో మంచి పేరు తెస్తామని తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రంలో యాన్యువల్ డే

చిన్నారులకు ప్రోగ్రెస్ కార్డులు అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్

సదాశివపేట, ఏప్రిల్ 22: మండల పరిధిలోని నందికంది అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం యాన్యువల్ డే నిర్వహించారు. ఐదేళ్ల లోపు చిన్నారులకు బోధనతోపాటు పోషకాలతో కూడిన భోజనం, ఆటపాటలు నేర్పుతూ చిన్నారుల ఎదుగుదలకు అంగన్‌వాడీ కేంద్రాలు ఎంతగానో దోహదపడుతున్నాయని తెలిపారు. అనంతరం పిల్లలకు ప్రోగ్రెస్ కార్డులను అందజేశారు. అంగన్‌వాడీ సూపర్ వైజర్ ఉమారాణి, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అంబలి కేంద్రం ప్రారంభం

అంబలి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ అపర్ణాపాటిల్

సదాశివపేట, ఏప్రిల్ 22: పట్టణంలోని లక్ష్మీకాంప్లెక్స్ వద్ద అంబలి కేంద్రాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ అపర్ణాశివరాజ్ పాటిల్ సోమవారం ప్రారంభించారు. మాజీ మున్సిపల్ చైర్మన్ ఆత్మకూర్ రామగౌడ్ తండ్రి జ్ఞాపకార్థం అంబలి కేంద్రాన్ని ఏర్పా టు చేయడం అభినందనీయమన్నారు. వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శ్రీనివాస్ గౌడ్, నర్సింహాగౌడ్, సాతాని శ్రీశైలం, ఖలీమ్, వాడోనిరాజు, విజయ్‌కుమార్, మల్లేశం పాల్గొన్నారు.